www.dailyreporttelugu.in

రవీంద్ర
వార్త
DAILY REPORT



## కాంట్రాక్టర్, గుమస్తాను కిడ్నాప్ చేసిన మావోయిస్టులు

రాయ్ పూర్ డైలీ రిపోర్ట్ వార్త : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో కిడ్నాప్ కలకలం సృష్టించింది.

- కాంట్రాక్టర్, గుమస్తాను మావోయిస్టులు కిడ్నాప్ చేశారు.
- మావోయిస్టుల చెర నుంచి గుమస్తా తప్పించుకున్నాడు.
- కాంట్రాక్టర్ కోసం భద్రతా బలగాలు గాలింపు చర్యలు చేపట్టాయి.

సోమవారం | 08.12.2025 సంపుటి:02 సంంచిక:65 పేజీలు: 04 ఎడిటర్ : బక్కరవీందర్ ప్రచురణ: హైదరాబాద్ వెల: రూ.5 –00



# స్పీకర్‌కు హరీశ రావు ఘాటు లేఖ..

హైదరాబాద్ డైలీ రిపోర్ట్ వార్త

- తెలంగాణ శాసన సభ ప్రతిష్టను దిగజారుస్తున్నారని, భంగం కలిగిస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. తెలంగాణ శాసనసభ స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారుఈ రెండేళ్ల కాలంలో అసెంబ్లీ నిర్వహణలో చోటుచేసుకున్న తీవ్రమైన వైఫల్యాలు, నిబంధనల ఉల్లంఘనలపై ఆయన ఆవేదన వ్యక్తం చేస్తూ స్పీకర్‌కు ఆదివారం బహిరంగ లేఖ రాశారు. రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడడంలో జరుగుతున్న పొరపాట్లను ఆ లేఖలో ఎండగట్టారు.శాసనసభ పనిదినాలు గణనీయంగా తగ్గిపోవడం పట్ల హరీశ్‌రావు అసహనం వ్యక్తం చేశారు. రూల్ 12 ప్రకారం సభా కార్యకలాపాలకు అవసరమైనన్ని రోజులు సభను నిర్వహిం చాల్సి ఉన్నా, అది జరగడం లేదని పేర్కొన్నా రు. అలాగే, సరైన కారణాలు లేకుండా సభను తరచుగా, హఠాత్తుగా వాయిదా వేయడం సభా సమయానికి సంబంధించిన రూల్ 13 తోపాటు వాయిదా పద్ధతులకు సంబంధించిన రూల్ 16 లకు విరుద్ధమని తెలిపారు.సభలో ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సభ్యులకు ఉన్న ప్రధాన క్వశ్చన్ అవర్, జీరో అవర్ నిర్వహణలో నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రూల్స్ 38 నుంచి 52, అదేవిధం గా రూల్స్ 53 నుంచి 62 వరకు ఉన్న నిబంధనలను పాటించడం లేదని అన్నారు. సభలో మంత్రుల నుంచి నేరుగా సమాధానం వచ్చే స్టార్డ్ క్వశ్చన్స్ చర్చకు రాకుండా చేస్తున్నారని, తద్వారా రూల్ 38 కల్పించిన ప్రశ్నల సమయ హక్కును కాలరాస్తున్నారని పేర్కొన్నారు.హోంశాఖ మంత్రి అమిత్ ప్రకటిస్తున్న విషయం విధితమే.

# కార్మిక హక్కులకు తూట్లు




హైదరాబాద్, డిసెంబర్ 7 (డైలీ రిపోర్ట్ వార్త): కార్మికులను అణచివేసేందుకే కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్ తీసుకువచ్చిందని, వెంటనే రద్దు చేయాలని కార్మిక సంఘాలు యావత్ దేశ వ్యాప్తంగా ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నాయి.లేని పక్షంలో పోరాటాన్ని ఉధృ తం చేస్తామని హెచ్చరిస్తున్నాయి. తాజాగా కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఉన్న 44 కార్మిక చట్టాల్లోని 29 చట్టాలను మార్చి నాలుగు లేబర్ కోడ్స్‌గా రూపొందించింది. వీటి ద్వారా దేశంలోని కార్మికులందరికీ ఎంతో మేలు జరుగుతుందని చెబుతున్నది.కానీ ఈ లేబర్ కోడ్‌లు మాత్రం కార్మికుల హక్కులకు తూట్లు పొడుస్తున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవానికి దేశంలో ఉన్న మొత్తం కార్మిక వర్గంలో ఎక్కువ శాతం అసంఘటిత కార్మికులే ఎక్కువ. ఈ నేపథ్యంలో ప్రస్తుత లేబర్ కోడ్‌లు అసంఘటిత కార్మికులకు ఏ విధంగానూ ఉపయోగపడవని ఆరోపణలు ఉన్నాయి. పాత కార్మిక చట్టాల స్థానంలో నాలుగు కొత్త కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చింది.ఇప్పటికే అమ ల్లో ఉన్న 29 కార్మిక చట్టాలకు బదులుగా, వాటన్నింటినీ కలిపేసి నాలుగు చట్టాలుగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. వాటిలో కార్మికుల పరిహార చట్టం-2019, పారిశ్రామిక సంబంధాల చట్టం-2020, సామాజిక భద్రతా చట్టం-2020, వృత్తి భద్రత (ఆక్యుపేషనల్ సేఫ్టీ), ఆరోగ్యం (హెల్త్), పని ప్రదేశాల్లో పరిస్థితులు (వర్క్‌ప్లేస్ ఎన్విరాన్మెంట్) చట్టం- 2020 ఉన్నాయి. అయితే ఈ నాలుగు చట్టాలు 2025 నవంబర్ 21 నుంచి అమల్లోకి వచ్చాయి.ఒక సంవత్సరం సర్వీస్ తర్వాత గ్రాట్యుటీకి అర్హత, ఓవర్ టైమ్ పనికి రెట్టింపు వేతనం, మహిళలు రాత్రిపూట పని చేయడానికి అను మతి వంటి నిబంధనలు ఈ కొత్త చట్టాల్లో ఉన్నాయి. ఈ చట్టాలను కార్మికులు, ఉద్యోగుల సంక్షేమం కోసం తీసుకొచ్చినట్లుగా కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. మరోవైపు, ఈ చట్టాలు కార్మికుల శ్రేయస్సుకు వ్యతిరేక చట్టాలని కార్మిక సంఘాలు విమర్శిస్తున్నాయి.

రవీంద్ర వార్త DAILY REPORT
www.dailyreporttelugu.in
సోమవారం | హైదరాబాద్
08-12-2025
www. dailyreporttelugu.in



# తెలంగాణ పంచాయతీ ఎన్నికలు... రెండో విడతలో 415 మంది సర్పంచ్ లు ఏకగ్రీవం

- ఏకగ్రీవంగా ఎన్నికైన 8,304 మంది వార్డు సభ్యులు
- అత్యధికంగా కామారెడ్డి జిల్లాలో 44 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం
- రెండు విడతల్లో కలిపి మొత్తం 810 సర్పంచ్ పదవులు ఏకగ్రీవం



తెలంగాణలో కొనసాగుతున్న పంచాయతీ ఎన్నికల రెండో విడతలో ఏకగ్రీవాలు భారీగా నమోదయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 415 మంది సర్పంచ్ అభ్యర్థులు, 8,304 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) అధికారికంగా ప్రకటించింది. జిల్లాల వారీగా పరిశీలిస్తే, కామారెడ్డి జిల్లాలో అత్యధికంగా 44 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం కాగా, నల్గొండ, నిజామాబాద్ జిల్లాల్లో చెరో 38 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి.రెండో విడతలో భాగంగా 4,332 గ్రామ పంచాయతీలకు, 38,322 వార్డులకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే, ఐదు గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ పదవికి, 107 వార్డుల్లో సభ్యుల పదవులకు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసే సమయానికి సర్పంచ్ బరి నుంచి 7,584 మంది, వార్డు సభ్యుల బరి నుంచి 10,427 మంది తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు.ఇప్పటి వరకు జరిగిన రెండు విడతలను కలిపి చూస్తే, రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 810 మంది సర్పంచ్‌లు, 17,635 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల సంఘం ప్రకటనలో స్పష్టం చేసింది. మిగిలిన స్థానాలకు త్వరలోనే పోలింగ్ జరగనుంది.

# అదే దోపిడీ అవినీతి!



హైదరాబాద్, డిసెంబర్ 7 (డైలీ రిపోర్ట్ వార్త ): 'రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయింది.. పరిస్థితిలో ఏ మార్పు జరగలేదు.. అదే దోపిడీ.. అదే అవినీతి.. నాడు కేసీఆర్ అండ్ సన్.. నేడు రేవంత్ అండ్ బ్రదర్స్.. మారిందల్లా ఒక్కటే గులాబీ జెండా కనుమరుగై.. హస్త వికాసం జరిగింది.. మిగతాదంతా సేమ్ టు సేమ్' అంటూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పదేళ్ల బీఆర్ఎస్, రెండేళ్ల కాంగ్రెస్ ప్రజాపాలనపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.కాంగ్రె స్, బీఆర్ఎస్ రెండూ అవినీతి, దోపిడీ, ప్రజలను మోసగించే పార్టీలంటూ మండిపడ్డారు. నాటి తరహాలోనే ప్రస్తుత సర్కా ర్‌కు కూడా భూములు అమ్మకుంటేపూట గడిచే పరిస్థితి లేదంటూ విమర్శించారు.ఏంసాధించారని ఉత్సవాలు జరుపుకుంటున్నారు..ఇచ్చిన మాట తప్పి వేడుకలు జరుపుకోవడం సిగ్గు చేటన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్చకు సిద్ధమా అంటూ సవాల్ విసిరారు. బీజేపీ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ ధర్నా చౌక్‌లో ఆది వారం చేపట్టిన మహాధర్నాలో కేంద్ర మంత్రి జీ కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షు డు ఎన్ రాంచందర్‌రావు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ లక్ష్మణ్, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్సీలు మల్క కొమురయ్య, అంజిరెడ్డి, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తోపాటు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను బయటపెట్టే చార్జ్‌షీట్‌ను బీజేపీ నేతలు విడుదల చేశారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడారు.

# తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు సర్వం సిద్ధం

హైదరాబాద్ డైలీ రిపోర్ట్ వార్త : తెంగాణ రాష్ట్ర ప్రభుత్వం నేడు, రేపు హైదరాబాద్ వేదికగా ప్రతిష్టాత్మకంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తోంది. సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీకి చేరుకుంటారు. గ్లోబల్ సమ్మిట్ వేదిక వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం పరిశీలించనున్నారు. మధ్యాహ్నం 1.30 గంటలకు గ్లోబల్ సమ్మిట్ ప్రారంభం కానుంది. ప్రారంభోత్సవ కార్యక్రమానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్యఅతిథిగా రానున్నారు. గ్లోబల్ సమ్మిట్ వేదికగా సీఎం రేవంత్ ప్రసంగించనున్నారు. తెలంగాణ ఉజ్వల్ లక్ష్యంగా ఆవిష్కరించే ప్రణాళికను రేవంత్ రెడ్డి వివరించనున్నారు. ప్రారంభోత్సవం తర్వాత వివిధ రంగాల ప్రతినిధుల బృందంతో సీఎం భేటీలు కానున్నారు. ప్రతి పావుగంటకు సీఎం వన్ టూ వన్ రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 3 నుంచి 7 వరకు దాదాపు 15 సమావేశాల్లో రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు. రాత్రి 7 గంటలకు ఫ్యూచర్ సిటీలో విందులో ఆయన పాల్గొంటారు.తెలంగాణ రైజింగ్ సమ్మిట్ కు 44 దేశాలకు చెందిన ప్రతినిధులు రానున్నారు. తెలంగాణ రైజింగ్ థీమ్ పేరుతో వివిధ రంగాల ప్రముఖులు ఒకే వేదికపైకి చేరనున్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కు వివధ రాష్ట్రాల ముఖ్యమంత్రులకు రాష్ట్ర మంత్రులు ఆహ్వానించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లిఖర్జున్ ఖర్గే, పలువురు కేంద్రమంత్రులను సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ఆహ్వానించారు. గ్లోబల్ సమ్మిట్ కు పరిశ్రమల అధినేతలు, ఒన్నోవేటర్లు, పాలసీ మేకర్లు, సినీ, క్రీడా, విద్యారంగాల ప్రముఖులు, విదేశీ రాయబారులు, వివిధ రంగాల నిష్ణాతులు హాజరుకానున్నారు. సదస్సులో పాల్గొనాలని 4800 మందికి రాష్ట్రప్రభుత్వం ఆహ్వానం అందజేసింది. సదస్సుకు 2 వేలమందికిపైగా అతిథులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ ప్రముఖుల రాక దృష్ట్యా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు.

# మల్లారెడ్డి వేల ఎకరాలు కబ్జా చేశారు: కవిత తీవ్ర ఆరోపణలు



- మల్లారెడ్డి పూలు,పాలు అమ్మి వేల ఎకరాలు కబ్జా చేశారని ఆరోపణ
- మేడ్చల్‌లో కనీస వసతులు కల్పించడంలో విఫలమయ్యారని విమర్శ
- భూముల క్రమబద్ధీకరణలో అవకతవకలపై సుప్రీంకు వెళ్తానని వెల్లడి

హైదరాబాద్, డిసెంబర్ 7 (డైలీ రిపోర్ట్ వార్త

- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మేడ్చల్‌లో పూలు, పాలు అమ్ముకొని వేల ఎకరాలు కబ్జా చేశారే తప్ప, గతంలో మంత్రిగా, ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న మల్లారెడ్డి పేదలకు చేసిందేమీ లేదని విమర్శించారు. 'జాగృతి జనంబాట' కార్యక్రమంలో భాగంగా నిన్న ఆమె మేడ్చల్ నియోజకవర్గంలో పర్యటించారు.

- ముందుగా జవహర్‌నగర్ డంపింగ్‌యార్డును పరిశీలించిన కవిత, అనంతరం అంబేద్కర్‌నగర్‌లో బస్తీవాసులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మేడ్చల్‌లో అభివృద్ధి జరిగిందని మల్లారెడ్డి చెబుతున్నా, వాస్తవ పరిస్థితులు దారుణంగా ఉన్నాయన్నారు. తన పర్యటనలో తాగునీరు, రోడ్లు, పాఠశాలలు, ఆసుపత్రులు వంటి కనీస మౌలిక వసతులు కూడా లేవని గుర్తించానని తెలిపారు. నియోజకవర్గంలో సరైన డిగ్రీ, జూనియర్ కళాశాలలు లేకపోవడంతో యువత ఉన్నత చదువులకు దూరమై గంజాయి వంటి వ్యసనాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
- జీవో నం.58, 59 కింద భూముల క్రమబద్ధీకరణ పేరుతో పేదల నుంచి డబ్బులు వసూలు చేసి ఏళ్లు గడుస్తున్నా రిజిస్ట్రేషన్లు పూర్తి చేయలేదని కవిత ఆరోపించారు. అదే సమయంలో మాజీ మేయర్, మల్లారెడ్డి కుటుంబ సభ్యుల భూములకు రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందని ఆమె ప్రశ్నించారు. ఈ అంశంపై అవసరమైతే సుప్రీంకోర్టు వరకు వెళ్తానని ఆమె స్పష్టం చేశారు. అనంతరం మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మాపూర్‌లో రైతులతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ పాలనలో సమస్యలు రెట్టింపయ్యాయని కూడా ఆమె విమర్శించారు

# రోజురోజుకీ వేడెక్కుతున్న ఎన్నికల ప్రచారం



హైదరాబాద్, డిసెంబర్ 7 (డైలీ రిపోర్ట్ వార్త

పంచాయతీ ఎన్నికల్లో పోటీకి రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఉత్సుకత ప్రదర్శిస్తూ సర్పంచి పీఠాన్ని దక్కించుకునేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఓవైపు అందివచ్చిన రిజర్వేషన్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ, భవిష్యత్తు రాజకీయ ప్రణాళికలను రచిస్తున్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో కూడబెట్టుకున్న సొమ్మును ఎంత ఖర్చు చేసేందుకైనా వెనకాడకుండా ఉన్నారు. తొలి, రెండో విడత బరిలో నిలిచే అభ్యర్థులు తేలడంతో ప్రచారానికి సిద్ధమవుతుండగా, మూడో ఫేజ్ నామినేషన్లు ఉప సంహరించుకునేలా పోటీలోని అభ్యర్థులను 'మచ్చిక' చేసుకునే ప్రయత్నాలను మరింత ముమ్మరం చేస్తున్నారు.గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల సందడే సందడి : సర్పంచి ఎన్నికల్లో గెలపే లక్ష్యంగా ఎంత ఖర్చు అయినా భరించాలన్న కృతనిశ్చయంతో అభ్యర్థులు ఉన్నారు. అంటే ఈ పంచాయతీ ఎన్నికలను వారు ఎంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నారో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికే పలు గ్రామాల్లో ఎన్నికల సంఘం విధించిన వ్యయ పరిమితులు దాటిపోయినట్లుగా తెలుస్తోంది.టర్ల సంఖ్య, గ్రామ పంచాయతీ స్థాయి ఆధారంగా అనధికారికంగా రూ.30 లక్షల నుంచి రూ.కోటి వరకు ఖర్చు చేయాలన్న నిర్ణయంతో ఉన్నట్లుగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో గ్రామాల్లో మద్యం ఏరులై పారుతూ, విచ్చలవిడిగా డబ్బు పంపిణీ జరిగేందుకు అవకాశముంది. పోటీ అధికంగా ఉన్న గ్రామాలపై ఎన్నికల అధికారులు నిఘా పెంచి మద్యం, డబ్బు పంపిణీ అరికట్టాలన్న అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి.ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా : రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండల కేంద్రంలో సర్పంచి అభ్యర్థులుగా ఐదు మంది ఎన్నికల బరిలో ఉన్నారు. అందులో నలుగురు రియల్ ఎస్టేట్ వ్యాపారం గుత్తేదారులే. ఆరు వేలకు పైగా ఓటర్లు ఉన్న ఈ పంచాయతీలో అభ్యర్థులు నువ్వా-నేనా అన్నట్లుగా పరిస్థితి ఉంది. ఇదే మండలం జిల్లెల మేజర్ పంచాయతీలోనూ ఇద్దరు రియల్ వ్యాపారుల మధ్య గట్టిపోటీ ఉంది. ఈ రెండు పంచాయతీల్లో రూ.50 లక్షల నుంచి రూ.కోటిపైనే ఖర్చు చేసేందుకు సిద్ధమవుతున్నట్లుగా తెలుస్తోంది.ఇల్లంతకుంట మండలంలోని కందికట్కూరులో గ్రానైట్ వ్యాపారి ఒకరు బరిలో ఉన్నారు. నామినేషన్లకు ముందే గ్రామంలో కుల సంఘాలను ఏకం చేసి మద్దతును కూడబెట్టుకున్నారు. ఒక్కో కుల సంఘానికి ఒక్కో పని చేసేందుకు ఒప్పందాలను కుదుర్చుకుంటున్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో విచిత్రంగా సర్పంచి, వార్డు సభ్యులను గెలిపించుకునేందుకు రియల్ వ్యాపారులు పోటీపడుతున్నారు. ఈ నెల 9వ తేదీన ఉప సంహరణకు ముందే తమ ప్యానెల్‌లో మెజారిటీ వార్డు సభ్యులను తమవైపు తిప్పుకొనేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.గ్రామాల్లో ఊపందుకున్న ఎన్నికల ప్రచారం : పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించినప్పటి నుంచి గ్రామాల్లో రాజకీయాలు మరింత రసవత్తరంగా మారాయి. సర్పంచ్ పీఠమే లక్ష్యంగా అభ్యర్థులు వ్యూహాలు రచిస్తున్నారు. ప్రచారంలో దూసుకుపోతూ పలు చిత్రవిచిత్ర హామీలు గుప్పిస్తున్నారు. తాము గెలిస్తే గ్రామాన్ని ఏవిధంగా అభివృద్ధి చేస్తామనే విషయాలను ప్రజలకు వివరిస్తున్నారు. మరికొంతమంది అభ్యర్థులు ఒక అడుగు ముందుకు వేసి గ్రామంలో కోతుల సమస్య లేకుండా చేస్తామని, ఐదేళ్లు ఉచిత హెయిర్ కటింగ్ లాంటి ఆఫర్లను ప్రకటిస్తున్నారు. పంచాయతీ ఎన్నికల తేదీ సమీపిస్తున్న కొద్దీ అభ్యర్థులు తమ ప్రచారంలో వేగం పెంచారు.

## పల్లెల్లో పంచాయతీ ఎన్నికల ప్రచార జోరు - ఇంటింటికీ తిరుగుతున్న అభ్యర్థులు

హైదరాబాద్, డిసెంబర్ 7 డైలీ రిపోర్ట్ వార్త

పల్లెల్లో పంచాయతీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. సర్పంచ్ పదవి ఛేజిక్కించుకునేందుకు అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారంలో దూసుకుపోతున్నారు. పార్టీలు బలపరిచిన అభ్యర్థుల గెలుపునకు అగ్రనేతలు బరిలోకి దిగి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. రాష్ట్రంలోని తొలి విడత పోలింగ్ జరిగే గ్రామాల్లో ప్రచారాలు ముమ్మరంగా సాగుతున్నాయి. అధికారమే లక్ష్యంగా అభ్యర్థులు వినూత్న రీతిలో ప్రచారం చేస్తూ ఓటర్ల మనసు గెలుచుకునేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం చెంజర్ల సర్పంచ్ అభ్యర్థి రాజేశ్వరి, వినూత్న ప్రచారం చేశారు. తాను ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మూడేళ్లలో అమలు చేయకుంటే చెప్పుల దండ వేసుకొని బహిరంగంగా రాజీనామా చేస్తానని బాండ్ పేపర్ రాసి ఇచ్చారు. ఈ విషయం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

ఖమ్మం జిల్లా వైరా మండలం తాటిపుడిలో సర్పంచి అభ్యర్థిగా ఎంటెక్ చదివిన జవ్వాజి అశ్విని పోటీ చేస్తున్నారు. ఉన్నత విద్యను అభ్యసించిన తాను, విదేశాలకు వెళ్లి స్థిరపడాలనుకున్నానని, కానీ తన భర్త సూచన మేరకు సర్పంచిగా గెలిచి గ్రామాభివృద్ధికి కృషి చేయాలనుకుంటున్నానని తెలిపారు. అశ్వినికి మద్దతుగా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ ప్రచారం చేశారు. విద్యావంతురాలైన అశ్వినిని గెలిపిస్తే, గ్రామం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు.

# ప్రముఖ నటిపై లైంగిక దాడి: మలయాళ సూపర్ స్టార్ పై కోర్టు తుది తీర్పు



ప్రముఖ నటిపై లైంగిక దాడి కేసులో మలయాళ సూపర్ స్టార్ దిలీప్ కు భారీ ఊరట లభించింది. ఆయనపై నమోదైన కేసును న్యాయస్థానం కొట్టివేసింది. నిర్దోషిగా ప్రకటించింది. ఇదే కేసులో మరో ఆరుమందిని దోషులుగా తేలారు. ఈ లైంగిక దాడి కేసులో వీరితో పాటు మరో 10ని దోషులుగా నిర్ధారించింది. ఈ మేరకు ఎర్నాకుళం డిస్ట్రిక్ట్ అండ్ ప్రధాన సెషన్స్ న్యాయస్థానం న్యాయమూర్తి జస్టిస్ హనీ ఎం వర్గీస్ కొద్దిసేపటి కిందటే తీర్పు ఇచ్చారు.2017 నాటి కేసు ఇది. ఓ ప్రముఖ మలయాళ నటిపై లైంగిక దాడి చోటు చేసుకుంది. ఈ ఘటన అప్పట్లో పెను సంచలనం రేపింది. 2017 ఫిబ్రవరి 17న కోచిలో ఆ నటిని ఆమె కారులోనే అపహరించారు. రాత్రివేళ సిటీ మొత్తం కారులో తిప్పుతూ దాదాపు రెండు గంటల పాటు లైంగిక దాడి చేశారు. ఈ ఘటన వెనుక దిలీప్ ప్రమేయం ఉందనే ఆరోపణలు అప్పట్లో వెల్లువెత్తాయి. మనస్పర్థల కారణంగా ఆమెపై లైంగిక దాడి చేయించాడంటూ వార్తలొచ్చాయి.

టాలీవుడ్‌లో మరో నూతన కథానాయకుడు అడుగుపెడుతున్నాడు. 'జై లవకుశ', 'జెంటిల్ మెన్' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన నటి నివేదా థామస్ సోదరుడు నిఖిల్ థామస్ హీరోగా పరిచయం కాబోతున్నాడు. ఆయన నటిస్తున్న తొలి చిత్రానికి 'బెంగళూరు మహానగరంలో బాలక' అనే విభిన్నమైన టైటిల్‌ను ఖరారు చేస్తూ, చిత్రబృందం ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది.మహి - రాజ్ దర్శక ద్వయం ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. బెంగళూరు నేపథ్యంలో సాగే ఈ కథకు సంబంధించిన పోస్టర్‌ను ఆసక్తికరంగా తీర్చిదిద్దారు. పవన్ కల్యాణ్ 'పంజా' సినిమా ఫస్ట్ లుక్, సత్యం కంప్యూటర్స్, 'కొలవెరి డి' పాట వంటి అంశాలను పోస్టర్‌పై పొందుపరచడంతో ఇది ఒకప్పటి కాలాన్ని ప్రతిబింబించే కథగా తెలుస్తోంది. సయా క్రియేషన్స్, ఫాల్కన్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై అఖిల్ యమ్మన్నగారి, ఎంఎస్ఎన్ మూర్తి, సీహెచ్ వీ శర్మ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.ఈ చిత్రానికి సాంకేతిక బృందం కూడా బలంగా ఉంది. ఇటీవల విజయవంతమైన 'మ్యాడ్', 'జాతిరత్నాలు' చిత్రాలకు రచయితగా పనిచేసిన ప్రవీణ్ పట్టు స్క్రీన్‌ప్లే, సంభాషణలు అందిస్తుండటం విశేషం. విశ్వదీప్ సంగీతం సమకూరుస్తుండగా, మల్లు నాయక్ సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరిస్తున్నారు. త్వరలోనే సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుందని నిర్మాతలు తెలిపారు.




Printed and Published by Bakka Ravinder, On Behalf Daily Report Publications and Broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar, H.No 3-11. Sangareddy District Telangana State, Editor. B.Shirisha, Print code TELTEL2019/082422, Cell: 85019 19707